
మాతృశ్రీ

# తరిగొండ వెంగమాంబ

రచన

జూలకంటి బాలసుబ్రహ్మణ్యం



ప్రచురణ

ధర్మప్రచార పరిషత్

తిరుమల తిరుపతి దేవస్థానములు

తిరుపతి.

# మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ

## (జీవిత చరిత్ర)

తిరుమల దివ్యక్షేత్రంలో కొలువైవున్న ఆనందనిలయుడు అదివో! దర్శించండి! కన్నుల కరవెల్ల తీరునట్లుగా నిలువెల్ల కన్నులు చేసికొని దర్శించండి! వక్షఃస్థలం పై ధరించిన మణికౌస్తుభం! మెడలో కంటె హారాలు, భుజకీర్తులు, నొసటన సింగారంగా మెరుస్తూవున్న తెల్లని పచ్చకప్పురపు నామం! ఇలా మణికిరీట మకరకుండలాలతో శంఖచక్రాలతో వరదకటి హస్తాలతో, చిన్మయదరహాసంతో దర్శనమిస్తూ వున్న శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యమంగళ విరాణ్మూర్తిని రెప్పలార్పక దర్శించండి!

భువనమోహన సుందరుడైన బ్రహ్మాండనాయకుడు ఎందరికో తన దివ్యమంగళవిగ్రహదర్శనాన్ని అనుగ్రహిస్తూ వున్నాడు. ఎందరినో ...... ఎందరెందరినో ఎన్నెన్నో విధాల ఆకర్షింపజేసుకుంటూవున్నాడు. ఎందరినో తన దగ్గరకు రప్పించుకుంటూ వున్నాడు. అలా వచ్చినవారు అందరిలో ఆనందనిలయుని చిరుమందహాసానికి మురులుగొన్న వారు కొందరు. మకరకుండలాల కాంతితో నిగనిగలాడుతూవున్న చెక్కిళ్ల చక్కదనానికి చిక్కినవారు మరికొందరు! తెల్లనైన నామాలసొంపుకు సోలినవారు ఇంకొందరు! ఆ స్వామివారి కడకంటి చూపులకు కరిగిపోయినవారు మరికొందరు! పై చేతుల్లో శంఖచక్రాలను ధరించి కింది కటివరదహస్తాలతో సొంపైన భంగిమలో నిలిచిన స్వామివయ్యారానికి వశులైనవారు మరెందరో! జన్మజన్మాల పాపపంకిలాన్ని దర్శనం మాత్రం చేతనే పునీతంచేసే దివ్యపాదద్వయ సౌందర్యానికి దాసులై వచ్చినవారు ఇంకెందరో! ఇలా ఒక్కటేమిటి! ఒక్కరేమిటి! ఆ స్వామివారిని, నిలువెత్తుగా అణువణువుచేత సమ్మోహింపబడి, నిరంతరం, దేవతలు, యక్షకిన్నర గంధర్వాదులు ................ మానవులు తిరుమలయాత్ర చేస్తూనే వున్నారు. కన్నులారా కన్నులనిండా శ్రీనివాసుని సమ్మోహన రూపాన్ని దర్శిస్తూనే వున్నారు. ఆ దివ్య సుందర రూపాన్ని చూడటానికి రెండు కన్నులు చాలక, ఆ అద్భుత తేజోరూపాన్ని ఒకేసారి

రెండు కన్నులతో దర్శింపలేక మనసా వాచాకర్మణా మరలుగొని మళ్లీ మళ్లీ తిరుమలేశుని సందర్శనకు వస్తూనే వున్నారు.

అనంతమైన యుగాల్లో తిరుమలేశుడు తన అద్భుత సౌందర్యం చేత భక్తులను ఆకర్షించుకొని దివ్య సందర్శన భాగ్యాన్ని కలిగించటం మాత్రమే కాదు. ఆయా భక్తుల ఆర్తిని పోగొడుతూ ఆర్తత్రాణపరాయణుడై ఆ పరమాత్ముడు ఆ పరంధాముడు చేసిన లీలలు ఎన్నో! ఎన్నెన్నో! మహిమలు మరెన్నెన్నో!

భక్త వరుదుడైన బాలాజీ ఒక భక్తుని మట్టిమూకుట్లో సంకటి కూడును తృప్తిగా ఆరగించి అతని సంకటాల్ని పోగొట్టాడని విని ఆనందించాం! ఒక భక్తునికి అడిగినవెంటనే తన ఆయుధాల్ని దానం చేసి, వట్టి చేతులతో నిలబడి, ఇప్పుడు చేతులుచాచి అడిగిన ప్రతి భక్తునికి దండిగా చేతులు నింపిపంపుతూ వున్న ఈ అదుగడగు దండాలవాని మెండైన చేతలను మన మందరం అనుభవించి ఆనందిస్తూనే వున్నాం!

ఎందరో భక్తుల సంసారదాహాలను తీర్చే ఈ తిరుమలప్పుడు తానే దప్పికగొని తిరుమలనంబి అనే భక్తునిచేత తిట్టించుకుంటూ తృప్తిగా నీళ్లుతాగి దప్పి తీర్చుకొన్నాడని కూడా విని ఆశ్చర్యపడ్డాం! ఎందరెందరికో ఎన్నెన్నో జన్మాంతరవాసనల్ని మటుమాయంచేసే మాయలగాడైన ఆనంద నిలయుడు సువాసనలను గుప్పించే అనంతాళ్వానులవారిచేతి విరులకు మరులు గొన్నాడని కూడా విని విచిత్రపడ్డాం! తన సంకల్పమాత్రం చేతనే సర్వజగత్తులను ఆడిస్తూవున్న ఆనందనిలయుడు తన బంగారు మందిరాన్ని విడిచి బైరాగిమఠానికి వెళ్లి ఒక సన్యాసితో గవ్వలాటను ఆడుతూ ఆనందించినట్లు కూడా విని అద్భుతానికి లోనయ్యాం! కాని... కానీ...

తిరుమల గోవిందుడు గోముగా మారాముచేస్తూ.... ఒక పరమ భక్తురాలు ఇచ్చే దివ్యమైన కర్పూర నీరాజనం కోసం మంకుపట్టుపట్టి మరీ కాచుకొని వున్నాడని మీరు ఎప్పుడైనా విన్నారా! ప్రతిరాత్రీ ఏకాంతసేవ అయినతర్వాత, బంగారువాకిళ్లు మూసినవెంటనే అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడైన కొండల రాయుడు నేరుగా ఆ భక్తురాలి ఇంటికే వెళ్లి,

ఆమె పాటలు పాడుతూవుంటే తాను ఆడుతూవుండేవాడనీ, ఇంకా ఆమె చెప్పే కబుర్లకూ, కథలకూ, ఊ కొడుతూ వుండేవాడని మీకు తెలుసా! అలా కాలక్షేపంచేస్తూ ఒకనాడు, వెంకటేశుడు ఆమె చేతిలో తన పట్టు వలవలను విడిచి వెళ్లిన సంఘటన గూర్చి వినడం పరమాశ్చర్యంగా వుంది కదూ. ఇంతమాత్రమేనా! పరంధాముడు ప్రతిరాత్రి ఏకాంతసేవానంతరం బంగారువాకిళ్లు మూసినతర్వాత ఆనందనిలయంలోనికి యోగమార్గంద్వారా వెళ్లి స్వయంగా తనను అర్చించే భాగ్యాన్ని ఆమెకు కలిగించాడట! ఇదెంత పరమాశ్చర్యం! ఒక సందర్భంలో ఆ భక్తురాలికి జరిగిన అవమానం తనదిగావే భావించి ఆ బ్రహ్మాండనాయకుడు తన రథోత్సవాన్నే ఆపివేశాడట! ఇది పరమాద్భుతమైన సంఘటన కదూ!

అంతటి మహద్భాగ్యాన్ని పొందిన పరమభక్తురాలు ఎవరు? ఇది ఏ వేదకాలంనాటి గాథో? ఏ పురాణ కాలంనాటి గాథో? అని ఆశ్చర్యపడుతూ, ఆసక్తిగా ఆనందనిలయుని లీలల్ని వినడానికి ఆతురతగా వున్నారా!

సమస్తలోకాలను కనుసన్నలలో నడిపించే కొండలరాయణ్ణి తన పరమ భక్తిచేత వశంచేసికొన్న పరమభక్త శిరోమణి మాతృశ్రీ తరిగొండవెంగ మాంబ!

ఆ పుణ్యవనిత కథ పురాణ కాలంనాటిది కాదు. వేదకాలం నాటిది అసలే కాదు. కేవలం రెండువందల ఏండ్లనాడు జరిగిన దివ్యగాథ మాత్రమే. సనామధేయులైన భగవంతుడు శ్రీవేంకటేశ్వరుడు - భక్తురాలు వేంగమాంబ. ఈ ఇరువురి నడుమ జరిగిన మధుర సన్నివేశాలెన్నో! వీనుల విందుగా వినండి మరి. వినేముందు భక్తవరదుడైన ఆ బ్రహ్మాండనాయకుని ఒక్కసారి గట్టిగా స్మరిద్దాం.

*అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకా!*
*గోవిందా! గోవిందా!! గోవింద!!!*

## ముత్యాల హారతి

ప్రతిరోజు రాత్రిపూట చివరగా ఏడుకొండలస్వామికి ఏకాంతసేవ జరుగుతుంది. ఏకాంతసేవ అంటే పవ్వళింపు సేవ అని అర్థం. శ్రీవారి గర్భాలయానికి ముందువున్న శయనమండపంలో ఏకాంత సేవకుగాను,

వెండిగొలుసులతో వేలాడదీసిన బంగారు నవార పట్టె మంచంపై 'మన వాళ పెరుమాళ్' (నిత్యనూతన వరుడు) అనబడే భోగశ్రీనివాసమూర్తిని వేంచేపు చేస్తారు. ఆ సమయంలో ఆనందనిలయంలో శ్రీస్వామివారి మూలవిరాణ్మూర్తికి చిట్టచివరగా "ముత్యాలహారతి" అనబడే మాతృశ్రీ తరిగొండవెంగమాంబగారి మంగళకర్పూర నీరాజనం ఇవ్వబడుతుంది. పిదప అదే హారతిని బయటికి తీసుకవచ్చి పట్టెమంచంపై పవ్వళించి వున్న భోగశ్రీనివాసమూర్తికి ఇవ్వడం జరుగుతుంది. ఆ మంగళహారతి వెలుగుల్లో శ్రీస్వామివారు వెండి గొలుసులతో వేలాడదీసిన పట్టెమంచంపై ఊగుతూ వుండగా, అదే సమయంలో, రాములవారి మేడ నడవలో శ్రీ స్వామివారికి ఎదురుగా దండెను మీటుతూ తాళ్లపాక అన్నమాచార్యుల వంశీయులొకరు "జో అచ్యుతానంద, జో జో ముకుందా! రావె పరమానంద రామగోవిందా!" అంటూ జోలపాట కమ్మగా పాడుతారు. ఒకవైపు తరిగొండవెంగమ్మగారి హారతినందుకొంటూ, మరోవైపు తాళ్లపాక వారి లాలిపాటనువింటూ యోగనిద్రకు ఉపక్రమిస్తూవున్న మనోహరదృశ్యాన్ని, శ్రీవేంకటప్రభువుల దివ్యతేజస్సును చూచి తీరవలసిందే కాని, వర్ణించడానికి మాటలు చాలవు. లేవు కూడ.

తిరుమల క్షేత్రంలో నేటికీ ప్రతిరోజు రాత్రి ఏకాంతాసేవా సమయంలో చివరగా శ్రీవేంకటేశ్వరస్వామివారికి తాళ్లపాక అన్నమాచార్యులవారి వంశీయులచే లాలిపాట, జోలపాట వినిపించబడుతుంది. అదే సమయంలో తరిగొండ వెంగమాంబవారి ముత్యాలహారతి జరుగుతుంది. ఇలా ప్రతిరోజు రాత్రి చివరగా ఇరువురు పరమభక్తులచే తిరుమల శ్రీవారు అందుకొంటూవున్న ఈ విశిష్టసేవలను తెలిపే నానుడే "తాళ్లపాకవారిలాలి - తరిగొండవారి హారతి."

ప్రతిరోజు ఉదయం సుప్రభాత సమయంలో "మేలుకొలుపు" పాటను, అలాగే ఏకాంతసేవాసమయంలో లాలిపాట, జోల పాటను వినిపించే పరమభక్తుడైన తాళ్లపాక అన్నమాచార్యుల గురించి విమానప్రదక్షిణంచేస్తూ శ్రీవారి హుండీకు ఎదురుగావున్న "తాళ్లపాకవారి సంకీర్తన భండారం" దగ్గరికి వెళ్లినప్పుడు విశదంగా తెలుసుకుందాం.

6

# తరిగొండ వెంగమాంబ

తిరుమల పుణ్యక్షేత్రానికి పరిసరాల్లో ఎన్నో పుణ్యభూములు దివ్య స్థలాలు నెలకొనివున్నాయి. ఎందరోమహనీయులు, యోగులు, అవధూతలు జన్మించారు. అలాంటి దివ్యస్థలమే తరిగొండ. తిరుపతికి పశ్చిమాన వాయిల్‌పాడు అనే పట్టణానికి 4 మైళ్లదూరంలో వుంది ఈ తరిగొండ గ్రామం. క్రీ.శ. 1730 ప్రాంతంలో ఆ ఊళ్లో కానాలకృష్ణయ్య, మంగమ్మ అనే పుణ్యదంపతులు వుండేవారు. వారికి కలిగిన ఐదుమందీ మగ సంతానం అయినందువల్ల కన్యాదానం చెయ్యడానికి కనీసం ఒక పుత్రికనైనా ప్రసాదించవలసిందని వేంకటేశ్వరస్వామివారిని వేడుకొంటూ ఆ దంపతులు వేంకటాచలానికి యాత్ర చేశారు.

కోరినవరాలరాయడు, సంతానప్రదాత అయిన ఏడుకొండల వెంకన్న వారి కోరికను మన్నించాడు. తత్ఫలితంగా కొద్ది కాలానికే వారికి ఒక పుత్రిక కలిగింది. వేంకటేశ్వరస్వామివారి దయతో పుట్టినందువల్ల ఆ శిశువుకు 'వెంకమ్మ' అని స్వామివారి పేరు పెట్టి పిలిచేవారు. పుట్టినది మొదలుగా వరప్రసాది అయిన వెంకమ్మ నిత్యమూ భజనలతో భక్తితో కాలక్షేపంచేసేది. గంటలకొద్దీ ధ్యానంలో మునిగిపోతూవుండేది. ఇది మంచిమార్గమే అని తొలుత భావించినా, తర్వాత తర్వాత తల్లిదండ్రులకు విచారమయింది. ఆడపిల్ల, పెళ్లికావలసిన పిల్ల, పరాయి ఇంటికి వెళ్లవలసిన పిల్ల పనీ, పాటా లేకుండా, చెయ్యకుండా నిమ్మళంగా ఇలా గంటలకొద్దీ కాలక్షేపం చెయ్యడం వారికి ఆందోళన కలిగించింది. ఈమె పరిస్థితి ఆ నోట ఆ నోట అంతటా వ్యాపించింది. వెంకమ్మ పిచ్చిదో, లేక దయ్యంపట్టిందో లేక ఏ భక్తుడో, భక్తురాలో ఇలా అవతరించిందో అని పలు పలు విధాలుగా చూసినవారు అనుకొనేవారు. వారి బంధువులు అందరూ వెంకమ్మ భక్తికి సంతసించేవారేకాని, ఆమె అందానికి అందరూ మురిసిపోయేవారే కాని ఆమెను మనుమాడడానికి మాత్రం ముందుకు వచ్చేవారు కారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంకా ఆలస్యం చేస్తే బాగుండదని, ఏమాత్రం క్షేమం కాదని తలచిన తల్లిదండ్రులు ఆమెకు వివాహ ప్రయత్నాలు చేయడానికి

ప్రారంభించారు. 'నాకు పెళ్లేమిటి? వేంకటేశ్వరుడే నా భర్త. కనుక నాకు పెళ్లి ప్రయత్నాలు చెయ్యవద్దు' అని వెంకమ్మ తల్లిదండ్రులను బ్రతిమాలాడేది. కాని కన్నకడుపు కదా, అలా గాలికి వదిలేస్తే ఎలా! ఆడపిల్ల బరువు బాధ్యతలు తెంచుకొని ఒక అయ్యచేతిలో పెట్టి రామా! కృష్ణా! అని నిశ్చింతగా వుండవచ్చును కదా అని భావించిన కృష్ణయ్య దంపతులు చిత్తూరుకు సమీపంలో నారగుంటపాళెం గ్రామానికి చెందిన ఇంజేటి వెంకటాచలపతి అనే యువకునకు ఇచ్చి బలవంతంగా పెళ్లి చేశారు. కలసి కాపురం చెయ్యకముందే దైవవశాత్తు వెంకమ్మ భర్త వెంకటాచలపతి మరణించాడు. పుట్టినింటిలోనే వున్న వెంకమ్మ ఇవేమి పట్టించుకొనక నిరంతరం శ్రీవేంకటేశ్వరుడే తనభర్త అని తలుస్తూ ఎప్పటిమాదిరే నిత్యసుమంగళిగా పూలూ, కుంకుమ, గాజులూ ధరిస్తూవుండేది.

ఈ పరిస్థితుల్లోనే తండ్రి కృష్ణయ్య మదనపల్లెవాస్తవ్యులైన రూపావతారం సుబ్రహ్మణ్యశాస్త్రి అనే గురువుగారిచేత వెంకమ్మకు ఉపదేశం చేయించాడు. బంగారుకు పరిమళం అబ్బినట్లుగా, అప్పటినుంచి భక్తి మార్గంలో వున్న ఆమె నిరంతరం ఆధ్యాత్మికోపాసనచేత పరిపూర్ణమైనది. తపస్వినిగా మారింది. ఆమె నోటినుంచి అలవోకగా కీర్తనలు వెలువడేవి. భక్తిశతకాలు ఎన్నో వల్లించేది. ఆమె రచనలను, తన్మయావస్థను చూచినవారు ఆమెను యోగినిగా భావించి 'వెంగమాంబ' అని గౌరవంగా పిలిచేవారు. భక్తిగా ఆరాధించేవారు.

ఇది సహించని కొందరు, సంప్రదాయజ్ఞులమని విర్రవీగేవారు కొందరు ఆమెను ఆక్షేపించేవారు కృష్ణయ్య కుటుంబాన్ని వెలివేసినారు. ఇంతలో సంచారానికి వచ్చిన పుష్పగిరి పీఠాధిపతులైన శ్రీశంకరాచార్యుల వారితో వెంగమాంబ విపరీతబుద్ధినిగూర్చి, సంప్రదాయవిచ్ఛిన్నతను గూర్చి వివరించారు. పుష్పగిరి పీఠాధిపతులు ఆమెను పిలిపించారు. వెంగమాంబకూడ టెంకాయలు, పూలుపండ్లతోకూడినపళ్లెంతో వెళ్లింది. పీఠంపై కూర్చొని వున్న శంకరాచార్యులకు వాటిని సమర్పించింది. కాని నమస్కారం మాత్రం చెయ్యక ప్రక్కన మౌనంగా నిలిచొని వుండగా పీఠాధిపతులు

'అమ్మా! భర్తలేని స్త్రీ సుమంగళిగా వుండడం సంప్రదాయ విరుద్ధం కదా! నీవు ఎందుకు వాటిని పాటించడం లేదు?' అని ప్రశ్నించారు. "స్వామీ! నా భర్త శ్రీవేంకటేశ్వరుడు. నేను నిత్య సుమంగళిని. సరే మీరు చెప్పినట్లు తలను బోడిచేయించుకొన్న మళ్లీ జుట్టు పెరగకుండ చెయ్యగలరా" అని ఎదురు ప్రశ్న వేసింది. దానితో నిరుత్తరుడైన పీఠాధిపతి, 'అది సరే! హిందూధర్మ పీఠాధిపతి అయిన నాకెందుకు నమస్కారం చెయ్యలేదు' అని మరో ప్రశ్న వేశాడు. వెంగమాంబ వెంటనే స్వామీ! మీరు లేవండి. మీరు కూర్చున్న పీఠానికి నమస్కారం చేస్తానని చెప్పి అలాగే చేతులు జోడించి వందనమాచరించింది. అంతే ఫెళఫెళమని చప్పుళ్లతో ఆ పీఠం కాలుతూ భస్మమై పోయింది. ఈ హఠాత్సంఘటనకు భీతిల్లి తాను బతికి బయట పడినందులకు సంతసిస్తూ — పీఠాధిపతులు వెంగమాంబను నిశితంగా పరిశీలించి కొనియాడుతూ "ఆమె దైవాంశ సంభూతురాలు. మహాయోగిని అయిన ఆమెకు కట్టుబాట్లు అనవసరం. ఆమె ఇచ్ఛవచ్చినట్లు వుండనీయండి. ఆమెను సేవించి తరించండి" అని చెప్పి వెళ్లిపోయినారు.

కుక్కతోక వంకర అన్నట్లు, కొందరుదుష్టులు ఆమెను వేధించేవారు. ఇవేవీ పట్టించుకోని వెంగమాంబ, ఆ ఊళ్లోని గుడిలో తానే స్వయంగా నరసింహస్వామిని పూజించేది. ధ్యానించేది. ఒకరోజు ఆగుళ్లోని ఆంజనేయ స్వామి విగ్రహందగ్గర ధ్యానం చేసుకుంటున్న వెంగమాంబను చూచి సహించలేని అర్చకులు "ఏ క్షేత్రానికో వెళ్లి తపస్సుచేసుకోక మా ప్రాణం తింటున్నావు గదే!" అంటూ ఆమె తలజుట్టు పట్టుకొని బయటికి జరజర యీడ్చినారు. ధ్యానభంగమై ఆమె చూచినచూపులకు బిక్కచచ్చిన అర్చకులు ఆమె పాదాలపై పడి శరణువేడినారు. అర్చకుని నోటినుండి వెలువడిన పలుకులు దైవ ప్రేరితాలుగా భావించి ఇరవై ఏండ్ల పదుచు అయిన వెంగమాంబ తరిగొండను విడిచిపెట్టి అరణ్యమార్గంగుండా పయనించి తిరుమల కొండను చేరుకొంది. అదే ఆ పరమభక్తురాలు జన్మలో తొలిసారిగా తిరువేంకటాద్రిని దర్శించిన శుభ సందర్భం. దివ్యాతి దివ్యమైన ఆ క్షణంలో ఆమె నోటినుండి జాలువారిన తిరుమలక్షేత్ర కమనీయ దృశ్యం ఇది.

ఘన గోపురములు ప్రాకార మంటపములు
తేరులు, సత్పుణ్యతీర్థములును
కమలాప్తకిరణ సంకలితంబులై ప్రకా
శించుచుండెడు హేమశిఖరములును
పావన పరివార దేవతాలయములు
మహిమనొప్పు విరక్త మఠవరములు
రంగదుత్తుంగ మాతంగ తురంగముల్
కొమరారు బహుసాధు గోగణములు

ముద్దుగా బల్కు శుక, పికములును, నీల
కంఠములును మరాళసంఘములు మఱియు
ఫలవనంబులు తులసికాదళ సుమములు
క్రిక్కిరిసియుండు వేంకటగిరి పురమున

అప్పురియందు దివ్యతర
హాటక కుంభ విరాజమానమై
యొప్పు విమాన మధ్యమున
నుత్తమపూరుషుడై మహాత్ముడై
ఒప్పుల కుప్పయై ధర మ-
హోన్నతుడై వెలుగొందుచుండు మా
అప్పుడు వేంకటేశ్వరు
దహర్నిశమున్ కమలా సమేతుడై.

— వేంకటాచల మాహాత్మ్యం

తొలిగా తిరుమలక్షేత్రాన్ని చేరుకొన్న వెంగమాంబ శ్రీస్వామివారిని దర్శించి కీర్తించింది. ప్రతిరోజూ శ్రీనివాసుని దర్శించి సేవించుకొనేది. వెంగమాంబ ఆశువుగా వచ్చిన హృద్యమయిన పద్యాలతో, శతకాలతో వెంకటేశ్వరుని కమనీయంగా, భక్తిరసార్ద్రంగా పరవశించి స్తుతించేది. ఈమె భక్తికి ఎందరో తన్మయు లయ్యేవారు. వర్చస్సుకు ఆకర్షితులై వందన

మాచరించేవారు. అంతకుముందే వెంగమ్మ మహిమను, భక్తిని గూర్చిన వార్తలు తిరుమలక్షేత్రంలో చేరి వ్యాపించినందువల్లా, ఆమె తిరుమల చేరినతరువాత ఆ భక్తురాలి తన్మయావస్థను చూచినవారు వెంగమాంబను మహాయోగినిగా భక్తురాలుగా కొనియాడేవారేకాని, నిలువ నీడలేక గుడి ఆవరణలోనో మండపాల్లోనో తలదాచుకొంటూవున్న వెంగమ్మ పరిస్థితిని మాత్రం ఎవరూ పట్టించుకొనేవారు కాదు.

ఇలాంటి సమయంలోనే ఆ పరమభక్తురాలు తిరుమలక్షేత్రంలోనే తనను స్థిరంగా వుండేట్లుగా అనుగ్రహిస్తూ, ఒక ఆవాసస్థలాన్ని చూపించ వల సిందిగా శ్రీ వేంకటేశ్వరస్వామివారిని పరిపరివిధాలుగా ప్రాధేయపడింది. ప్రార్థించింది. ఆనాటి రాత్రి ఆలయ ప్రాంగణంలో నిద్రిస్తూవున్న వేంగ మ్మకు కలలో శ్రీస్వామివారు కనపడి "వెంగమ్మా!" మహిమాన్వితమైన ఈ వేంకటాచలక్షేత్రంలో నీవు వుండదలిస్తే నాకేమీ అభ్యంతరం లేదు. కాని నా వక్షఃస్థలంలో కొలువైవున్న వ్యూహలక్ష్మిని వేడికో, ఆమె సమ్మతించినచో నీవు దండిగా వుండవచ్చు" నని పలికి శ్రీమహాలక్ష్మిని ఉపాసించవలసిందని ఆదేశించినాడు. తెల్లవార లేచిన వెంగమ్మ ఆశ్చర్యపడి ఆనందంలో శ్రీస్వామి వారి ఆజ్ఞగా అలమేలుమంగమ్మను ఉపాసించి, తిరుమలలో వుండేందుకు దయ జూపమని ఆర్తిగా అడిగింది. వినమ్రంగా వేడికొనింది.

ఆనందనిలయుడు, ఆయనవక్షఃస్థలంలోని అలమేలుమంగమ్మ వేరు వేరు కాదు కదా! ఇద్దరూ ఒక్కటే కదా! అంతేకాదు. భక్తులను రక్షించడంలో, అనుగ్రహించడంలో స్వామివారిని మించి అమ్మవారు, అమ్మవారిని మించి స్వామివారు పోటీపడుతుంటారు. ఒక్కొక్కప్పుడు భక్తుల పక్షాన తాను వకాల్తా పుచ్చుకొని స్వామివారిచేత ఒప్పించి అనుగ్రహింపచేస్తూ వుంటుంది. జగన్మాత అలమేలుమంగ. ఇలా ఇద్దరూ కూడ బలుక్కొని భక్తులను సంపూర్ణంగా అనుగ్రహించి, ఆనందింపజేస్తూ వుంటారు. అలమేలుమంగా వేంకటేశ్వరులిద్దరూ వెంగమ్మప్రార్థనను విన్నారు. అనుగ్రహించారు. తిరు మల క్షేత్రంలోనే స్థిరంగా ఆమెకు నివాసం ఏర్పాటు చేయ సంకల్పించారు. ఆ భక్తురాలికి గడియ గడియకు గుడి ఆవరణలోనో పూట పూటన పరుల పంచనో తలదాచుకొనే అవస్థను పోగట్టదలిచాడు శ్రీనివాసుడు.

శ్రీస్వామివారు తన ఆంతరంగిక భక్తుడైన స్వామీహథీరాంబాబాజీవారి శిష్య పరంపరలో, మహంతుమఠానికి అప్పటి అధిపతి అయిన ఆత్మారాందాసుకు (క్రీ.శ. 1745-50 ప్రాంతంలో) ప్రేరణ కలిగించాడు.

ఆత్మారాందాసు స్వయంగా వెంగమాంబ దగ్గరికి వెళ్లి "అమ్మా! భగవత్సంకల్పం ఏమిటోకాని, మీకు తిరుమల కొండమీద నివాసాన్ని ఏర్పాటు చెయ్యవలసిందని ప్రేరణ కలుగుతున్నది. దయచేసి నా ద్వారా ఏర్పాటు చేయబడుతున్న సదుపాయాన్ని స్వీకరించి భక్తవరదుడైన శ్రీవేంకటేశ్వరుని సేవిస్తూ, భక్తులను కూడ తరింపజేయగలరని" ప్రార్థించినాడు. పిదప శ్రీవారి తూర్పుమాడవీధి చివరన ఈశాన్యమూలలో శ్రీవారి రాతిరథం పక్కన ఒక పూరిగుడిశను నిర్మించి ఇప్పించినాడు. అంతేకాదు శ్రీవారి ఆలయంలోని వంటశాలను, పిండివంటల తయారీని పర్యవేక్షిస్తూవున్న శ్రీవేంకటేశ్వరుని తల్లియగు వకుళమాత పేరుతో ఒక పడి బియ్యాన్ని దానికి తగిన ఇతర వంటవస్తువులను ప్రతిరోజూ తరిగొండ వెంగమాంబకు పంపునట్లుగా మహంతు ఆత్మారాందాసు తీర్మానించినాడు. శ్రీవారి ఆలయ పరిపాలనను మహంతులు స్వీకరించడానికి (1843-1933) పూర్వం ఇంచుమించు నూరేండ్ల క్రిందట జరిగిన వృత్తాంతం ఇది. అయినా అప్పటి మహంతులు పరమభక్తులుగా తిరుమల యాత్రికుల సేవచేస్తూ వున్నవారుగా ప్రసిద్ధిచెంది శ్రీవారి ఆలయంలోకూడ ప్రధానవ్యక్తులుగా ప్రముఖ పాత్రను నిర్వహించేవారు. అందువల్ల అప్పటి మహంతు ఆత్మారాందాసు ఏర్పాటుచేసిన బియ్యంకట్టడిని, అప్పటి ఆలయ అధికారులు అంగీకరించి వెంగమాంబ కుటీరానికి నిత్యమూ దినవెచ్చంగా, శ్రీవారి ఆలయం ఉగ్రాణం నుండి పంపే ఏర్పాటుచేశారు. భక్తశిరోమణి వెంగమాంబకూడ తన ప్రార్థనను ఆలకించి అనుగ్రహించిన అలమేలుమంగా వేంకటేశ్వరులదయకు సంతోషించి మహంతు ఏర్పాటుచేసిన సదుపాయాన్ని అంగీకరించింది.

తిరుమలలో ఆశ్రయం గురించి, ఆహారం గురించి నిశ్చింత అయిన వెంగమ్మకు ఇప్పుడు మరొకచింత పట్టుకొంది. అది ఎంతకు ఎడతెగని చింత. అదే ఏడుకొండలవానిమీద చింత! ఆ చింతతోనే ఎప్పుడూ ఆనందనిలయాన్ని అంటిపెట్టుకొని వుండేది. ఆలయం మూసిన వేళలో

మాత్రమే తన కుటీరంలో స్వయంపాకం చేసికొని శ్రీస్వామివారికి నివేదించి భుజించేది. ఇలా తన సర్వస్వమూ తిరుమలేశుడే! కళ్లు తెరచినా, మూసినా కొండలరాయునిమీద ధ్యాసేగాని అన్యం ఎరుగదు. ఆమె ధ్యానిస్తే సరి! సప్తగిరీశుడు ఎదుట నిలిచేవాడు. మాటలు చెపితే సరి! చక్కగా వింటాడు. ఊ కొడతాడు. ఆమె పాటలు పాడుతూవుంటే పరవసించి నాట్యం చేసేవాడట శ్రీనివాసుడు! ఇంతలో వెంగమ్మకు మరో కోరిక కలిగింది. ప్రతిరోజూ ఉదయం శ్రీవారి మూలమూర్తి అలంకరణకు పూలమాలల్ని సమర్పించాలనీ, ప్రతిసాయంత్రం చివరగా స్వామివారికి కర్పూర నీరాజనం ఇవ్వాలని భావించింది.

తులసీప్రియుడైన తిరుమలేశునికోసం తులసివనాన్ని పెంచదలచింది. తన కుటీరానికి వెనుక దిక్కున పడమటి వైపున ఒక తోటను ఏర్పాటు చేసింది. అందుకోసం ఒక దిగుడుబావిని తవ్వించింది. కాని ఆ బావిలో అడుగున విశాలమైన బండ అడ్డు తగిలింది. వెంగమాంబ ఆ బావిలోనికి దిగి ఆ బండను పూజించి గంగాభవానిని ప్రార్థించి, పైకి వచ్చింది. వెంటనే బావిలోని బండ బీటలు వారి గంగమ్మ పెల్లుబికింది. వెంగమాంబ చూపిన మహిమకు ప్రజలంతా వేనోళ్లపొగిడి ఆరతు లిచ్చారు. ఆ దిగుడు బావి నీటిని పారించి, తీరికవేళల్లో వెంగమ్మ తులసీవనాన్ని పెంచింది. పూల మొక్కలు కూడ నాటింది. ఆ తోట ద్వారా సేకరించిన పూలను, తులసిని మనోహరంగా దండలుగా కూర్చి ప్రతిరోజూ ఉదయం శ్రీస్వామివారి మూలమూర్తుల అలంకరణకు సమర్పించేది. శ్రీవారి సహస్రనామార్చనకు తులసిదళాల్ని సమకూర్చేది. అలాగే ప్రతి సాయంత్రం స్వయంగా హారతి పళ్లెం తీసుకొని ఆనందనిలయానికివెళ్లి స్వయంగా శ్రీస్వామివారికి హారతిని జరిపించేది.

వెంగమాంబ ఆనాడు తవ్వించిన దిగుడుబావిని నేడుకూడ తిరుమలలో చూడవచ్చు. పాపవినాశంనకు వెళ్లే దారిలో శ్రీవారి ఏనుగుల శాలవుంది. దానికి దగ్గర్లో అమ్మోరి బాయి (అమ్మవారి బావి) అనే వ్యవహారంతో వెంగమ్మబావి వుంది. ఇందులోని నీళ్లను నేటికీ దేవస్థానంవారు తోటలను పెంచడానికి ఉపయోగిస్తూ వున్నారు.

వెంగమాంబ సమర్పించిన పూలమాలల్లో, తులసీమాలల్లో శ్రీనివాసుడు మరింత ఉత్సాహంగా వుంటూ భక్తులకు ఆనందాన్ని కలిగించేవాడు. సాయంత్రంపూట చివరగా వెంగమ్మ సమర్పించే కర్పూరనీరాజనపు వెలుగుల్లో వెంకటేశ్వరుడు వింత వింత వెలుగులతో ప్రకాశిస్తూ భక్తులకు దివ్యమైన అనుభూతుల్ని ప్రసాదిస్తూ మైమరిపించేవాడు.

తీరికవేళల్లో వెంగమ్మ తులసీవనంలో ఒక పెద్ద చదునైన బండపై కూర్చొని భక్తుల పాలిటి ఆశ్రితపారిజాతమై భాసిస్తూవున్న శ్రీనివాసుని గూర్చి కవిత లల్లేది. పాటలు గానం చేస్తూ కాలంక్షేపం చేసేది.

ఇలా ఆయమలేఖినినుండి జాలువారిన "విష్ణుపారిజాతం"అనే యక్షగానం శ్రీస్వామివారిని కీర్తించే గంధర్వగానమై వరలింది. ఈ యక్షగానం శ్రీనివాసునికే అంకితం ఇవ్వబడింది.

తరిగొండ వెంగమ్మ చూపుతూవున్న మహిమలవల్లా, రాస్తూవున్న భక్తిరచనలవల్ల ఆమెమీద తిరుమలవాసులకు, యాత్రికులకు, అత్యంత భక్తి ప్రపత్తులు ఏర్పడినాయి. సాక్షాత్తు శ్రీనివాసుడే ఆమెతో మాట్లాడేవాడనీ, ఆమె గానాన్ని పరవశించి వింటాడనీ, ఒక్కొక్కసారి నాట్యం చేసేవాడనీ, ప్రచారం కలిగి ఆ వెంగమ్మను సాక్షాత్తు వేంకటేశుని అంశ కలిగిన మహనీయురాలిగా భావించి కీర్తించి తరించేవారు. ఆమె చేత ఆశీస్సులను పొందడం, సాక్షాత్తు స్వామివారి అనుగ్రహాన్ని పొందినట్లేనని భావించేవారు.

ఇలాంటి తరుణంలోనే తిరుమలస్వామివారి సేవల్లో ప్రముఖంగా పాలు పంచుకొంటూవున్న పరమభక్తులైన తాళ్ళపాక అన్నమాచార్యుల వంశీయులు తరిగొండ వెంగమాంబను గూర్చి, ఆమె మహిమలను గూర్చి, ఆమె భక్తి రచనల గురించి విన్నారు. పైగా వెంగమాంబ తమ నందవరీక బ్రాహ్మణ శాఖకు చెందిన దగుటవల్లా, పరమభక్తురాలగుటవల్లా తాళ్ళపాకవారు ఆమెను ఆహ్వానించి, ఉత్తరమాడవీధిలో శ్రీవరాహస్వామి ఆలయం వెనుక తాము నివాసం ఉంటున్న తమ ఇంటిలో కొంతభాగాన్ని ఆమె వుండటానికి ఉచితంగా ఇచ్చారు. ఆ నాటినుంచి వెంగమాంబ తన పూరిల్లును వదలి తాళ్లపాక వారి అండన చేరింది. అక్కడా ఆ ఇంటి వెనుక కూడా వెంగమాంబ ఒక తులసీవనాన్ని పెంచుతూ శ్రీవారికి తులసీ మాలల

కైంకర్యాన్ని నిర్వహిస్తూ అహరహం ఆనందనిలయుని సేవలోనే కాలాన్ని గడుపుతూ వుండింది.

ఆమె ఇంటి పక్కనే అక్కారాందీక్షితులు అనే శ్రీవారి సర్కారు అర్చకులు వుండేవారు. శ్రీవేంకటేశ్వరస్వామివారి ప్రధాన అర్చకులు కదా వారు. వారి ఐశ్వర్యమునకు కొదవేమి? సంపదతోపాటు బంధుబలగమూ, అంగబలమూ, మందీ మార్బలము సహజంగానే చేరిన అక్కారాం దీక్షితులు తిరుమలలో ప్రముఖులుగా పరిగణింపబడేవారు. అందువల్ల అహంకారమూ, గర్వమూ, దర్పమూ అన్నీ ఆ అర్చకుణ్ణే ఆశ్రయించాయి. అంతే. నిత్యమూ తన లోకంలో తానువుంటూ, ఒకరి శొంఠికి గాని సొద్దుకు గాని పోకుండా శ్రీనివాసుని సేవల్లో జీవితాన్ని పండించుకుంటూ వున్న వెంగమ్మను చూచి అక్కారామయ్య అక్కస్సు పట్టలేక నిందించేవాడు. తిరుమలలో అందరూ నన్ను గౌరవిస్తూ వుంటే నా మొగంవైపు అయినా చూడదే! పైగా అందరూ ఆమెను భక్తురాలుగా పొగడుతూవుంటే ఈర్ష్య పడ్డాడు. నేను శ్రీస్వామివారిని స్వయంగా తాకి పూజించే ప్రధాన అర్చకుణ్ణే కదా! నా కంటె భక్తురాలా ఏమి? అంటూ విపరీత బుద్ధితో వెంగమ్మను తూలనాడే వాడు. వూరునుంచి తరుమగొట్టబడి, ఇక్కడ పెద్దభక్తురాలుగా చలామణి అవుతున్నది అంటూ ఆమెను నిందించేవాడు. విధవరాలు సుమంగళిగా, పూలు కుంకుమ ధరించడం, శ్రీవారికి పుష్ప కైంకర్యం చేయడం, దేవస్థానం అధికారుల్లో ఆమెయందు భయము, భక్తి ఉండడం పైగా తాళ్లపాకవారు ఆమెను ఆహ్వానించి తమ పక్కనే గౌరవించి వుంచడం వంటి పనులవల్ల అర్చకులయిన రామదీక్షితుల మనస్సు ఇంకా క్రోధపూరితమయింది. ఆమె చెవిన పడేట్లుగా కూడ అర్చకులు ఆమెను నోటికి వచ్చినట్లు దూషించేవాడు. అయినా అలౌకిక ఆధ్యాత్మికజగత్తులో అందులో, జకత్కల్యాణమూర్తి సుందరదరహాసంపై తదేక లగ్నమానసురాలై చరిస్తున్న వెంగమాంబకు అతనిమాటలుకాని, అతని చేష్టలుకాని ఆనలేదు, అంట లేదు. వినాశకాలే విపరీత బుద్ధిః — అన్నట్లు అర్చకుని బుద్ధి ఇంకా వక్రించింది. ప్రతిరోజు ఉదయం, రాత్రి ఆమె తులసివనంలో ఎంగిలివిస్తళ్లు, తన బంధువులచేత వేయించేవాడు. ఈ దుష్టచర్యను ఆమె

ఓర్పుతో సహించి ఒకటి రెండుమారులు సవినయంగా చెప్పిచూచింది. కాని 'కుక్కతోక వంకర' అన్నట్లు అర్చకుని పరిస్థితి అలాగే కొనసాగుతూ వుండేది.

ఒకనాడు వెంగమాంబ తిరుమల శ్రీనివాసప్రభువులకు నిలువెల్ల పూల మాలలు సమర్పించి, అర్చనాదులు అయిన తర్వాత శ్రీవారి ప్రసాదాన్ని స్వీకరించి, భక్తిరసార్ద్రచిత్తయై వెర్రిగా ఆనందిస్తూ ఇల్లు చేరుకొంది. పెరటిలో ఒక పీఠంపై కూర్చొని, అక్కడినుంచే సూర్యకోటి భాసమానంగా ప్రకాశిస్తూ మైమరిపిస్తూవున్న ఆనందనిలయవిమానశిఖరాన్ని తదేకంగా చూస్తూ ధ్యాననిమగ్నమైంది. సరిగ్గా అపరాహ్ణవేళ. ఆయమ సమాధిస్థితి లోనికి వెళ్లి ఆనందబాష్పాలు రాలుతూవుండగా బాహ్యస్మృతిని వీడింది. అలాంటి స్థితిలో పక్క ఇంటిలోని అర్చకులు, అతని బంధుగులు భోజనాలు ముగించి తమ పెరటిలోనుండి ఎంగిలివిస్తళ్లు వెంగమ్మ తులసివనంలోనికి విసరివేసినారు. సరిగ్గా ఆ ఎంగిలాకులు ధ్యాననిమగ్నయైన వెంగమ్మమీద పడ్డాయి.

శ్రీవేంకటేశ్వరస్వామివారు ఎవరైనా తనను తిట్టినా, దూషించినా ఏమీ అనడట! అన్నీ భరిస్తాడట! కాని తన భక్తులనుమాత్రం ఎవరైనా సరే ఏ మాత్రం దండించినా, దూషించినా, హింసించినా అణుమాత్రమైనా సహించడట! ఆ భక్తులు క్షమాబుద్ధితో వదలిపెట్టినా ఆ భగవంతుడు మాత్రం వారిని శిక్షించిగాని వదలడు.

అలాగే వెంగమ్మమీద పుల్లి విస్తరాకులు పడగానే ధ్యానభంగమైంది. వెంటనే వెంగమ్మను వేంకటేశుడు ఆవహించినాడు. అంతే! వెంగమ్మ కళ్లు ఎర్రబడ్డాయి. తీవ్రమైన దృక్కులతో అక్కారాం దీక్షితులను చూస్తూ! "ఓరీ పాపీ! నేటితో నీ వంశం సరి! నేటితో సమూలంగా కుప్పకూలిన వృక్షంవలె నశింతువుగాక" అని శపించింది. ఆమె ఉద్వేగంతో ఊగిపోయింది. వెంగమాంబ శాపాగ్నికి మిడతలవలె ఎక్కడివారక్కడ రక్తం కక్కుకుంటూ చతికిల బడ్డారు. ఇలా అర్చకులు బంధుసమేతంగా యమయాతనలు పడుతూ నిర్జీవులవుతూవుండగా, వారిలో అర్చకులవారి కుమారుడొక్కడు అలాగే కాళ్లీడ్చుకుంటూ, మరణావస్థలో వెంగమ్మను చేరుకొని శరణు

వేడినాడు. రక్షించమని ప్రాధేయపడినాడు. అప్పటికి వెంగమ్మ తీవ్రత తగ్గి "ఇప్పటినుంచి మీవంశంలో ఒక్కడొక్కడు మాత్రమే మిగులుగాక" అని శాపతీవ్రతను తగ్గించింది. ఆ వచ్చినవాడు బతుకుజీవుడా అంటూ బతికి బట్టకట్టినాడు. ఆనాటినుంచి తిరుమల శ్రీవారి సర్కారు అర్చకుల ఇంటిలో ఒక్కరు మాత్రమే జీవిస్తూ వంశం కొనసాగుతూవున్నది.

భగవంతుని దూషించటంకన్న, భక్తుని దూషించటం, హింసించటం ఎంతో విపరీత ఫలాలను కలిగిస్తుంది కదా!

తిరుమల శ్రీవారి ఆలయం బ్రిటీషు వారి పాలనలో అనగా ఈష్టిండియా కంపెనీ పాలనలో వుండగా, శ్రీస్వామివారిని వంశపారంపర్యంగా పూజించే మిరాశీ అర్చకులకు ఏకారణంచేతో ఆలయంలో ప్రవేశించకూడని అనివార్య పరిస్థితి ఏర్పడింది. అలాంటిస్థితిలో ఆలయకార్యక్రమాలకు అర్చనలకు ఎలాంటి భంగం కలగకుండా మరొక వైఖానస అర్చకుని అప్పటి ప్రభుత్వం నియమించింది. అతనే "సర్కారు అర్చకులు." అప్పటినుంచి సర్కారు అర్చకులు కొనసాగుతూ ఆలయ అర్చనల్లో పాల్గొంటూనే వున్నారు. నేడు 'సర్కారుహారతి' – "సర్కారుఉత్సవం" అనే పదాలకు దేవస్థానంవారి హారతి, దేవస్థానం వారి ఉత్సవం అని అర్థం చేసికోగలరు.

ఇది జరిగిన సాయంత్రం, వికలమనస్కురాలు అయిన వెంగమాంబ హారతిపళ్లెంతో శ్రీవారి ఆలయంలో ప్రవేశించి, విచారంతోనే కర్పూర హారతిని సమర్పించింది. ఇది గమనించిన ఆనందనిలయుడు సాక్షాత్తుగా ఆమెతో "వెంగమ్మా! ఇది నేను చేసిన కార్యం. కనుక నీవు ఎంతమాత్రం చింతించవలసిన పనిలేదు. దుష్టులను దండించ వలసిందే. అందువల్ల నిష్కారణంగా నిన్ను దూషిస్తూ నానాబాధలు పెట్టిన అర్చకునకు తగిన శిక్షే అది. అది నావల్లే జరిగినది. కనుక జరిగినది మరచిపోయి ఇకమీద ప్రతిరోజు సాయంత్రం స్వయంగా నీవువచ్చి హారతిని సమర్పించి నన్ను ఆనందింప చేయవలసింది." అని పలికినాడు. అంతటితో వెంగమాంబ మనసు తేలికపడి, అప్పటినుండి క్రమం తప్పకుండా ప్రతిరోజూ సాయంత్రం పూట కర్పూర నీరాజనాన్ని స్వయంగా శ్రీవారికి సమర్పిస్తూ ఆనందించేది. అంతేకాదు. శంఖ, చక్ర కటివరదహస్తుడు, వజ్రకిరీటధారి, కర్ణ

కుండల భూషణుడు, చిన్మయహాసుడు, నాగాభరణుడు, నందకాయుధధారి, శ్రీవత్సముద్రాంకితుడు, పీతాంబరధారి అయిన ఆనంద నిలయుని దివ్య మంగళమూర్తి ఎదుటనే గంటలకొద్దీ ధ్యానిస్తూ వెంగమ్మ అక్కడే కాలాన్ని గడుపుతూ వుండేది. ఆలయ అధికారులుకూడ ఆమెను ఆవగింజంతయినా అడ్డగించేవారు కాదు. మీదు మిక్కిలి ఆమెకు సభక్తిపూర్వకమైన మర్యాదలు చేసేవారు. ఆమె చర్యలు ఆలయకార్యక్రమాలకు కొంత అంతరాయం కలుగుతున్నా లేదా ఆలస్యం జరుగుతున్నా ఆమెను వారించకపోగా, పైపెచ్చు ఆమె ఆలయంలో ఉండడమే భక్తులు కూడా మహాభాగ్యంగా భావించేవారు. సంతోషించేవారు.

ఇలా జరుగుతూవుండడం, అర్చకులలో మళ్లీ నెరనెర ప్రారంభమైంది. రాను రాను కంటగింపై, ఆమె ఆలయానికి వచ్చినపుడంతా సూటిపోటి మాటలు అనేవారు అర్చకులు.

అది బ్రహ్మోత్సవ సమయం. శ్రీవారి అర్చక శిఖామణులు అత్యంత విశిష్టమైన అమూల్యములైన వజ్రవైఢూర్యమరకత మాణిక్యాది నవరత్నాల ఆభరణాలతో శ్రీవేంకటేశ్వరుని దివ్యమంగళమూలవిరాణ్మూర్తిని మనోహరంగా అలంకరించారు. ఇంకా సుగంధసుమనోహరమైన విరుల దండలతో వెంకన్నమూర్తిని నయనాభిరామంగా తీర్చిదిద్దారు. అలాంటి సమయంలో పరమభక్తురాలు అయిన వెంగమాంబ పూలమాలతోను, హారతి తట్టతోను వచ్చి కర్పూరనీరాజనాన్ని తనివితీరా సమర్పించింది. కన్నులారా ఆనాటి కొండలరాయుని వింత వింత సోయగాల్ని దర్శిస్తూ, మైమరచిపోయింది వెంగమ్మ.

ఇది ఏమాత్రం సహించలేక అర్చకులు 'ఎంత భక్తురాలైనా ఇదేమి వింత. వితంతు స్త్రీ, వేంకటేశునికి హారతి ఇవ్వడమా! తగుదునమ్మా అని అర్చకులను మించి తానే అర్చకురాలైనది. సిగ్గులేకపోతేసరి. ఎంత అపచారం అపచారం. నవ్వినా తగినట్లు వుండవలె. అమంగళం అయిన స్త్రీ పూలూకుంకుమా ధరించి, సింగారించుకొని వచ్చి నిత్య కల్యాణమూర్తి అయిన పెరుమాళ్లను పూజించకపోతే స్వామివారికి ఒరిగేది ఏమీలేదు తరిగేది లేదు. నేటికి సరే! రేపటినుంచి ఈమెను కోవెల లోనికి

రానీయకూడదు' అని వెంగమ్మకు వినపడునట్లుగా నిందించారు. ఆ మాటలు విన్న వెంగమ్మ నిరుత్సాహంగా ఇల్లు చేరింది.

"తాను ఆలయానికి వెళ్లడం అందరికి బాధాకరమయితే తానెందుకు వెళ్లాలి? వారికి ఎందుకు నొప్పి కలిగించాలి? ఇక మీదట నేటినుంచి ఆలయానికి వెళ్లటమే మానివేస్తాను. హారతిని తీసుకెళ్లనుగాక తీసుకెళ్లను. కాని శ్రీవేంకటేశ్వరుని దివ్యదర్శన భాగ్యం లేకుండా జీవించగలనా? ఇది మరీ దుర్భరమే. వారి మాటలనైనా భరించవచ్చుకాని. శ్రీవారి దర్శనం లేకపోవడం భరించగలనా? ఏది ఏమైనా నేను వెళ్లకపోవడమే మంచిది. శ్రీవారి అర్చకుల మనస్సైనా శాంతిస్తుంది కదా." అని ఇలా పరిపరి విధాల ఆలోచిస్తూ ఇది తన దౌర్భాగ్యమేమో! కన్నులారా కొండలరాయుని దర్శించలేని తన దురదృష్టం ఎంతటిదో కదా! అని మనసును రాయిగా చేసికొని ఆలయానికి వెళ్లడం మానివేసింది వెంగమ్మ. ఇలా ఒకవారంరోజుల పాటుజరిగింది. శ్రీవారి అర్చకులు మహా సంతోషపడ్డారు. ఆ స్త్రీ తమ మాటలను విని రాకపోవడం వాళ్లకు ఆనందం కలిగించింది. వెంగమ్మకు మనం బాగా బుద్ధి చెప్పాం. ఇంక ఇటువైపు తిరిగి చూడదుగాక చూడదు. అని వారిలో వారు మురిసిపోయారు.

అర్చకులమాటలు విని వెంగమాంబ ఆలయానికి రాకుండా వుండటం, ఆనందనిలయునికి ఆందోళన కలిగించింది. రేపు వస్తుంది. మాపు వస్తుంది. తులసిమాలలు సమర్పిస్తుంది, హారతిని ఇస్తుంది అని ఎదురుచూచి ఎదురు చూచి భక్తురాలికోసం నిరీక్షించాడు ఏడుకొండలవాడు. అర్చకులకు మళ్లీ బుద్ధిని చెప్పదలిచాడు. మరోమారు ఆమె గొప్పదనాన్ని చాటదలిచినాడు అంతే.

మరునాడు బ్రహ్మోత్సవంలో చివరిరోజు శ్రీవారి తేరు ప్రారంభమైంది. శ్రీదేవి భూదేవీ సమేతంగా మలయప్పస్వామి రథారూఢుడై తిరుమల వీధుల్లో అశేషజనవాహినికి దర్శనమిస్తూ క్రీగంట అందరినీ అనుగ్రహిస్తూ బయలు దేరాడు. ఈ రథోత్సవం క్రమంగా దక్షిణ, పశ్చిమ మాడ వీధుల్లో ఏ అంతరాయం లేకుండా సాగింది. ఇక ఉత్తరమాడ వీధిలో తేరు ముందుకు సాగుతూ, ఉన్నపళంగా తరిగొండ వెంగమాంబ ఇంటిముందు ఆగిపోయింది.

అర్చకులు, ఆలయ అధికారులు, యాత్రికులు, తిరుమలవాసులు రథాన్ని కదిలించడానికి శతవిధాల ప్రయత్నించారు. వారిదృష్టికి మేరుపర్వతం మాదిరి గోచరించి ఆనందనిలయుని రథం ఆవగింజంతయినా కదలలేదు గాని అందరికీ శ్రమమాత్రం మిగిలింది. ఇలా గంటలకొద్దీ కాలయాపన జరిగింది. ఈ ఆలస్యంవల్ల ఆలయ కార్యక్రమాలకు భంగం కలిగింది. జరిగిన ఈ రథోత్సవ ఆటంకానికి ఎన్నోవిధాల పరిశీలించిన పెద్దలు, "ఏ భక్తులకో, మహనీయులకో కష్టం జరగడంవల్లా, మనస్సు నొప్పిపడినందువల్లా, ఇలా జరిగి వుండవచ్చు"నని తీర్మానించారు. ఇలా నిశ్చయించడంతోనే అర్చకులకు వారం కిందట తాము తరిగొండ వెంగమాంబను దుర్భాషలాడటం, అప్పటినుంచి ఆమె ఆలయానికి రాకపోవడం స్ఫురణకు వచ్చింది. ఇది నిజమే కావచ్చు. ఎందుకంటే ఈ రథంకూడ వెంగమ్మ ఇంటిముందే ఆగిపోయింది అని అనుకుంటూ బిర బిర అర్చకస్వాములు వెంగమ్మ ఇంటిలోనికి వెళ్లి సాష్టాంగ నమస్కారం చేసి, తల్లీ నీవు వచ్చి హారతి ఇచ్చి స్వామిని ప్రార్థిస్తే రథం ముందుకు కదులుతుంది తల్లీ! మమ్మ క్షమించవమ్మా! అని ప్రాధేయపడగా, నేను "ప్రార్థిస్తే, హారతిస్తే రథం కదులుతుందని మీరు విశ్వసిస్తే తప్పక అలానే చేస్తాను" అంటూ వెంగమాంబ హారతి పళ్లెంతో బయటికివచ్చి, జగత్కల్యాణ చక్రవర్తి అయిన శ్రీనివాస ప్రభువులకు కర్పూరనీరాజనం ఇచ్చి ముందుకు నిరాటంకంగా కదలమని ప్రార్థించింది. అంతే సునాయాసంగా సప్తగిరులవంటి రథం జర జర ముందుకు సాగింది. ఆనాటి నుంచి అర్చకులు మరింత భక్తి ప్రపత్తులతో ఆమెను ఆహ్వానించి ఆమె వచ్చేంతవరకు వేచివుంటూ ఆమె చేత కర్పూర నీరాజనాల్ని స్వామివారికి ఇప్పించేవారు.

ప్రతిరోజు ఉదయం తులసిమాలల సమర్పణ, మధ్యాహ్నం కవితా వ్యాసంగం, సాయంత్రం కర్పూరనీరాజనం, రాత్రి ఏకాంత సేవానంతరం ఇంటిలోనే తిరుమల స్వామివారితో సత్సంగము ఇలా సాగుతూవుండింది వెంగమాంబ దినచర్య.

ఒకనాటి సాయంత్రపూట. వెంగమాంబ యథాప్రకారంగా హారతి పళ్లెంతో శ్రీవారిసన్నిధికి వెళ్లింది. కర్పూర నీరాజనం సమర్పిస్తున్న వేళలో, శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలవిరాణ్మూర్తిలో దశావతారదర్శనమూ, పిదప బ్రహ్మాండభాండాలలో ఆవరించియున్న శ్రీవారి విరాట్ తేజోస్వరూపమూ చర్మ చక్షువులతోనే దర్శించి ధన్యురాలయ్యింది వెంగమ్మ. ఆనాటినుంచి ప్రతిరోజు చిట్టచివరిగా వెంగమాంబగారి కర్పూరహారతి లేనిదే, రానిదే ఆలయం మూసివేయ కూడదని, ఆ కర్పూరహారతి అయిన తర్వాత మరే ఇతర హారతులు ఇవ్వరాదని, తర్వాత ఆలయం తలుపులు మూసివేయాలని శ్రీవేంకటేశ్వరస్వామివారు అర్చకస్వాములకు, అధికారులకు స్వప్నంలోనూ, అర్చకముఖంగా ఆవేశించి ఆదేశించినారు. అప్పటినుంచి ప్రతిరోజు ఏకాంతసేవా సమయంలో చిట్టచివరగా పరమభక్తురాలుఅయిన వెంగమాంబగారి "ముత్యాలహారతి" అయిన తర్వాతనే శ్రీవారిఆలయం మూసివేయబడుతున్నది.

తన తదనంతరం కూడ ఈ "ముత్యాల హారతి" కొనసాగేందుకుగాను తరిగొండ వెంగమాంబ, తన చెల్లెలు కూతురగు మంగమ్మను దత్తుగా స్వీకరించింది. నేటికిని ఆమె వంశంవారే వేంగమాంబగారి పేరుతో తిరుమల స్వామివారికి ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవా సమయంలో చివరగా కర్పూర హారతిని సమర్పిస్తూవున్నారు.

ఇలా అడుగడుగునా ఆనందనిలయుడు తనయందు చూపిన, చూపుతూ వున్న లీలలతో, మహిమలతో తరిగొండ వెంగమాంబ మరింత భక్తితో పరవశురాలయింది. అప్పటి నుంచి ప్రతిక్షణం పరంధాముని కీర్తించేది. ప్రతి నిముసం శ్రీవారిని జపిస్తూ వుండేది. అనుక్షణం ఆనందనిలయునిదర్శిస్తూ ఆనందపడేది. ఇలా ప్రతిరోజూ పగలంతా గడిచేది. రాత్రిపూట హారతి ఇచ్చిన తర్వాత వెంగమాంబ వేంకటేశునిపై కవితలల్లేది. కావ్యాలు రాసేది. పగలంతా తన సన్నిధికి రప్పించుకొని సేవ చేయించుకున్న శ్రీనివాసుడు రాత్రులందు ఆమె ఇంటికే వచ్చేవాడు. ఆమె రాసే పాటలను పరవసించి వింటూ తిరుమలేశుడు ఆహా! అంటూ తలను ఊపుతూ వుండేవాడు. ఒక్కొక్కసారి ఆ నిత్యకల్యాణచక్రవర్తి తన మీది దండలనుండి విరులు

రాలేట్లుగా నాట్యం చేసేవాడు. భళీ! వెంకమ్మా ఆ రచన అద్వితీయం. ఆ ఊహ ఎంతో రమణీయం. ఆ కల్పన ఎంత కమనీయంగా వుంది.... అంటూ ఇలా స్వామివారు, ఆమె చెప్పే ప్రతిమాటనూ, రచననూ వ్యాఖ్యానించేవాడు. ఇలా ఆనందనిలయుని ప్రత్యక్ష సాక్ష్యంతో తరిగొండ వెంగమాంబ గళంనుండీ కలంనుండి శ్రీకృష్ణమంజరి, రుక్మిణీ కల్యాణం, గోపికా నాటకము, జలక్రీడా విలాసము, అష్టాంగ రాజయోగసారం, ముక్తికాంతా విలాసము, వాసిష్ఠ రామాయణం.. వంటి అమూల్య రచనలు, వేదాంతగ్రంథాలు, నాటకాలు, ద్విపదలు ఎన్నో... ఎన్నెన్నో వెలువడినాయి. అయినా శ్రీనివాసునికి తృప్తి కలగలా.

ఒకనాడు వేంకటాద్రిమీది కృష్ణుడు చిన్ని రూపంతో తప్పటడుగులు వేస్తూ, వెంగమాంబ దగ్గరికి వెళ్లి "అమ్మా! అమ్మా! నాకు ఈ కథను విన్పించవూ! నీవేమో కత చెప్తావుం మరి నేనేమో ఊం కొడుతూ వింటా. సరేనా" అంటూ భాగవత గ్రంథాన్ని ఆమె చేతికిచ్చాడట! నా చిన్నికృష్ణా! నీమాట నే నెప్పుడైనా కాదన్నానా! నీవేది నాతో చెప్పిస్తే అది చెప్తా. నీవు దేన్ని పలికిస్తే దాన్నే నేను పలుకుతా. సరేనా" అంటూ ఆనాటి నుంచి వెంగమాంబ పగటిపూట శ్రీస్వామివారి సేవానంతరం భాగవతమహాకావ్యాన్ని పండితులకేగాక, సామాన్య పామరజనులకు సైతం సులభంగా అర్థమయ్యేలా, అవగతమయ్యేలా ద్విపదలో రచన సాగించింది. రాత్రి ఏకాంతసేవానంతరం ఆలయాన్ని విడిచి తన ఇంటికి ఏతెంచిన శ్రీవేంకటేశ్వరస్వామివారికి రుచ్యములైన పిండివంటల విందులతోపాటు, సాహితీవిందుకూడ చేసేది. ఆ స్వామికూడ ఆమె వడ్డించిన వంటలను ప్రీతిగా తింటూ, ఆమె నోటినుండి జాలువారే భాగవతకథ ద్వారా గడచిన అనంతయుగాల్లోని తన గాథలను వింటూ మైమరచేవాడు. మళ్లీ తెల్లవార సుప్రభాత సమయంలో ఆలయంలో ప్రత్యక్షమై భక్తులకు దర్శన మిచ్చేవాడు.

ఇలా జరుగుతూవుండగా ఒకనాటిరాత్రి ఆలస్యంగా వచ్చిన స్వామి వారిని సేదతీర్చి, పాదసేవనం చేస్తూ, వెంగమాంబ "స్వామీ! శ్రీనివాసా! సర్వజగాల నేలే నా కన్నయ్యా! నన్ను గన్నతండ్రీ! నీవు ప్రతిరోజూ ఇలా రావడం అలా వెళ్లడం ఏమీ బాగాలేదు. నేను సహించలేకుండా వున్నాను.

నీవు నిత్యమూ, నా దగ్గరే నన్ను విడవకుండా నీ సాన్నిధ్యాన్ని నాకు ప్రసాదించవలసింది" అంటూ పరి పరి విధాల ప్రార్థించింది. ప్రాధేయపడింది.

"తల్లీ! వెంకమ్మా! అలా ఎలా కుదురుతుంది? నాకు నీవంటి పరమ భక్తులెందరో వున్నారని నీకూ తెలుసుగదా! మరి వారికి అందరికీ నా సాన్నిధ్యాన్ని ప్రసాదించాలికదా. అదిగాక ఎక్కడినుంచో, ఎక్కడెక్కడి నుంచో నానా వ్యయ ప్రయాసలను ఓర్చుకుంటూ నా సన్నిధికి నిత్యమూ వస్తూవున్న యాత్రికులకు, నన్ను నమ్ముకొని వస్తూవున్న భక్తులకు నిత్యదర్శన భాగ్యాన్ని కలిగించి తీరవలె గదా! వారినందరినీ సంతృప్తి పరచి ఆనందింప జేయవలె కదా! అందువల్ల నీ కోరిక తీర్చడం ఎలా వీలవుతుందమ్మా!" అంటూ చిరు నవ్వును చిందిస్తూ సందేహాన్ని వెలిబుచ్చాడు ఆనందని లయుడు. అంత వెంగమాంబ, వేంకటేశుని పట్టు పీతాంబరాన్ని గట్టిగా పట్టుకొని లాగుతూ — "నీ మాయమాటలు నాదగ్గర కట్టి పెట్టవయ్యా స్వామీ! నీవా, ఈ కల్లబొల్లి మాటలు చెప్పేది. నా దగ్గరా చెప్పేది. ఆదిమధ్యాంతరహితుడవు! సత్తా మాత్ర శరీరుడవు! స్వయం ప్రకాశుడవు! జగదీశ్వరుడవు! సర్వాంతర్యామివి! ఎందెందు వెదకిన అందందు కలవానివి! నీవులేని ప్రదేశంకాని, అణువుగాని ఎక్కడైనా వున్నాయా? 'అణోరణీయాన్ మహతో మహీయాన్" అనే ఉపనిషత్తులోని మాటకు కట్టుబడినవానివి నీవు కదా!మరి అలాంటి నీవా నన్ను మభ్యపెట్టేది? అందువల్ల నీదొంగమాటలు, మాయమాటలు కట్టిపెట్టి ఓ స్వామీ! నీవు అంతటా వుంటూ కూడా నాకు నీ ప్రత్యక్ష సాన్నిధ్యాన్ని తప్పక ప్రసాదించవలసిందే." అంటూ చేతులు జోడించి నమస్కరించింది.

అంత వెంగమాంబ మాటలకు వేంకటేశ్వరుడు అడ్డు తగులుతూ "అది కాదు వెంగమ్మా!......" అంటూ ఏదో చెప్పబోతూ వుండగా ఇంతలో శ్రీవారి ఆలయంలోని బంగారువాకిలి దగ్గర "కౌసల్యా సుప్రజా రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే." అని శ్రీవారి అర్చకశిఖామణుల సుప్రభాత పఠనం తిరుమల గిరులంతా మార్మోగుతూ విన పడింది. అంతే ఉలిక్కిపడుతూ వేంకటేశుడు ఉన్న ఫళంగా అంతర్ధానమై ఆలయంలో ప్రత్యక్షమయ్యాడు. ఇక్కడ వెంగమాంబ గట్టిగా చేతితో పట్టుకొన్న శ్రీస్వామివారి పట్టు

పీతాంబరం సగం చినిగిపోయి ఆమె చేతిలో మిగిలిపోయింది. వెంకమ్మ శ్రీస్వామివారి ఆ శేషవస్త్రాన్ని మహాప్రసాదంగా భావించి రెండుకన్నులకు అద్దుకొంటూ దానిని మడతపెట్టి పూజలో భద్రంగా వుంచింది.

ఇక్కడ శ్రీవారిఆలయంలో సుప్రభాతసమయంలో బంగారువాకిళ్లు తెరచి లోనికివెళ్లిన అర్చకులు శ్రీవారి మూలవిరాణ్మూర్తిని ఆపాద మస్తకం చేతులారా, కన్నులారా సేవించుకొన్న తర్వాత పరిశీలించి చూడగా, అందులో శ్రీస్వామివారి పట్టు పీతాంబరం కొంతభాగం చిరిగిపోయి, కొంతవేలాడుచున్నట్లుగా గమనించి ఆశ్చర్యపోయారు. చినిగిపోయిన సగం ఎక్కడ? దొంగలు పడ్డారా! ఇంకా ఏమైనా పోయాయా! అని అంతటా శోధించారు. కాని ఒక్కవస్త్రం మాత్రమే చింప బడినట్లుగా నిశ్చయించి అధి కారులకు తెలియ జేశారు అర్చకులు. అధికారులు కూడ పెక్కువిధాలుగా పరిశీలించి, పరిశోధించి "ఇది దొంగలపని ఏమాత్రం కానేకాదు. దొంగలకు దొంగ అయిన వెన్నదొంగ, మహామాయలకాడైన శ్రీనివాసుని మాయలలో ఇది కూడ ఒక మహిమగా నిర్ణయించి తీర్మానించారు. తిరుమలక్షేత్రంలో ఎక్కడి కైనా, భక్తుల ఇండ్లకు స్వామివారు వెళ్లి వుండవచ్చును. అక్కడ ఆ భక్తులతో ఆడిన పరాచికాలాట ఫలితమే ఇది కావచ్చు." అంటూ ఆలయ అధికారులు, అర్చకులు, మహంతు మఠాధిపతి.... ఇలా అందరూ ఏకగ్రీవంగా నిశ్చితాభిప్రాయానికి వచ్చారు. "ముందుగా ఈ తిరుమలలో భక్తులను విచారించి తెలుసు కుందాం. అనుకుంటూ అయినా తరిగొండ వెంగమాంబను మించిన భక్తులు ఎవరు వుంటారు? ముందుగా ఆయమ దగ్గరికి వెళ్లి అదుగుదాం".... అని అధికారులు, అర్చకులు అందరూ గుంపుగా వెంగమాంబ ఇంటికి వెళ్లారు. ఆ భక్తురాలికి సభక్తిపూర్వకంగా నమస్కారాలు సమర్పించిన పిదప శ్రీ వెంకటేశ్వరస్వామివారి దివ్యమంగళ మూలవిరాణ్మూర్తికి అలంకరించిన [illegible] ర్చి, అవి చిరిగి పోయి సగం వస్త్రం [illegible] ర్చి ఆమెకు విన్నవించుకున్నారు.

అంత వెంగమాంబ [illegible] సాధారణ విషయమే అన్నట్లు [illegible] లో దేవుని దగ్గర వుంది. అదే ఇదేమో [illegible] ంది.

· అర్చకస్వాములు అత్యంత విస్మయంతో, ఆసక్తితో వెంగమ్మ ఇంటిలోనికి వెళ్లి పూజలోవున్న శ్రీవారిపట్టువస్త్రాన్ని పూర్తిగా విప్పిచూస్తూ ఆశ్చర్య పోయారు. ఆ పట్టుపీతాంబరమే ఇది. ఏమాత్రం సందేహంలేదు. కాని ఇది చిరిగిపోకుండా సంపూర్ణంగా వుందే! అంటూ మరింత ఆశ్చర్య ఆనందాలకు లోనయ్యారు. శ్రీవేంకటేశభగవానునికి, శ్రీవారి అంతరంగిక భక్తశిరోమణి అయిన వెంగమాంబకు — ఈ ఇరువురికీ, మానవులకు ఏమాత్రం తెలియరాని, ఊహించలేని, అంతుబట్టని అలౌకిక లీలావిశేషాలు ఏవేవో నిత్యమూ జరుగుతున్నాయని భావనచేస్తూ అవ్యక్తమైనటువంటి దివ్యానుభూతుల్ని చవిచూస్తూ అర్చకులు, వెంగమాంబ అనుమతితో ఆ పట్టు వస్త్రాన్ని స్వీకరించి, దానిని వెండి పళ్లెంలో పెట్టుకొని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి వచ్చి చూడగా, శ్రీవారిమూలమూర్తిపై అంతకు ముందున్న సగం వస్త్రం కూడా పూర్తిగామాయమయ్యింది. ఇది దర్శించిన వారిని అందరిని మరింత ఆశ్చర్యానికి లోనుచేసి, కళ్లల్లో ఆనందబాష్పాలు రాలాయి. ఈ పట్టువలువ ఎంతో విలువైంది. స్వామివారికి ఎంతో ప్రియ మైంది అనుకుంటూ అర్చకశిఖామణులు వెంగమాంబవద్దనుంచి తెచ్చిన పట్టువస్త్రాన్ని శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తికి అలంకరించి, అర్చించి ఆరాధించారు. వేంగమాంబ సాక్షాత్తుగా వేంకటేశ్వరుని అవతారంగా భావిస్తూ ఆమెను మరింత భక్తిప్రపత్తులతో భక్తులు సేవించేవారు.

మహాభక్తుడు మహంతుమఠంఅధిపతి అయిన ఆత్మారాందాసుల ఆద రణపొందడం, రాతిబండపడిన బావిలోనీళ్లు వూరడం, మహనీయులైన తాళ్లపాకవారు చేరదీసి చోటుఇచ్చి ఆదరించడం, అర్చకులను శపించటం, శ్రీవారిరథోత్సవం ఆగిపోవడం, వెంగమాంబహారతితో మళ్లీ కదలడం, శ్రీ స్వామివారు వెంగమాంబహారతిని శాశ్వతంగాకోరడం, పట్టుపీతాంబరాలను స్వామివారు వెంగమాంబ ఇంట్లో వదలివెళ్లడం..... వంటి సంఘటన లతో, ఇంకా ఆమె చేసిన రచనలతో ప్రజలలో, భక్తులలో, తరిగొండ వెంగమాంబ యందు అత్యంత భక్తిప్రపత్తు లేర్పడినాయి. ప్రతిరోజు ఆమెను దర్శించుకొనేవారు. ఆమె ఆశీస్సులను పొందేవారు. వెంగ మాంబ సౌభాగ్యగనం మహిమ దేశమంతటా వ్యాపించింది. ఎందరెందరో

జమీందారులు, భూస్వాములు, పాళెగార్లు, సంస్థానాధీశులు, ఆమెకు దానాలు చేశారు. భక్తితో విరాళాలు ఇచ్చారు. భూములను ఇనాములుగా సమర్పించారు. ధనాన్ని కానుకలుగా చెల్లించారు.

వెంగమాంబ భక్తులద్వారా వచ్చిన ఈ ధనాన్ని యావత్తూ తిరుమల భక్తులకోసమే వినియోగించింది. పేద యాత్రికులకోసం అన్న సత్రాలను నిర్వహించింది. వేసవికాలంలో చలివేంద్రాలను ఏర్పాటుచేసింది. ప్రతిసంవత్సరం బ్రహ్మోత్సవంలో భక్తులకు అన్నదానం వంటి సౌకర్యాలను ఇబ్బడిముబ్బడిగా వెంగమాంబ నిర్వహించేది. అలాగే ప్రతి ఏడాది వైశాఖ మాసంలో నృసింహ జయంతిని పురస్కరించుకొని పదినాళ్లపాటు పెద్దగా నృసింహుని జయంత్యుత్సవాలు తానే స్వయంగా జరిపించేది. ఈ ఉత్సవాల్లో భక్తులందరికీ ఉచితంగా ప్రసాద వితరణను ఏర్పాటుచేసేది వెంగమాంబ. బాల్యంలో వెంగమాంబకు ఇష్టదైవం తరిగొండలోని నృసింహస్వామి. అందువల్లే తాను ఈ ఉత్సవాలు నిర్వహించడమేకాక, తాను చేసిన ప్రతి రచనలోను, తరిగొండనృసింహునికి, తిరుమల శ్రీవేంకటేశ్వరునికి అభేదాన్ని కల్పించింది. వెంగమాంబ దృష్టిలో నృసింహుడూ వేంకటేశ్వరుడు ఇద్దరూ అభిన్నులు. అందువల్లే నృసింహస్వామి జయంత్యుత్సవాల్లో సయితం శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ వేంకటేశ్వరుడు వెంగమాంబ ఇంటికి వేంచేస్తూ పూజా నివేదనాదులందుకొంటూ వున్నాడు. ఇది నేటికీ తిరుమలలో జరుగుతూవున్న సంప్రదాయం కూడా.

అంతేగాక వెంగమాంబ భక్తులిచ్చినధనంతో తాను రాసిన కావ్యాలకు రచనలకు ప్రతులను వ్రాయించేది. ఈమె స్థాపించిన మఠంలో "అష్ట ఘంటములు" అనేపేరుతో ఎనిమిదిమంది వ్రాయసకాండ్రును ఏర్పాటు చేయబడ్డారు. వీరంతా ఆమె రచనలకు ప్రతులను వ్రాసేవారు. వెంకటగిరి, కాళహస్తి, కార్వేటినగరం సంస్థానాధీశులు, కూచిపూడిభాగవతులు మున్నగు వారు వెంగమాంబ గ్రంథాల ప్రతులను తయారు చేసుకొని వెళ్లేవారు.

వెంగమాంబ రచనలలో అత్యంత విశిష్టమయినదీ అగ్రగణ్యమయినదీ. "శ్రీ వేంకటాచలమాహాత్మ్యము" అనే పద్యకావ్యం. జగత్కల్యాణ చక్రవర్తి

అయిన శ్రీ వేంకటేశ్వరుని మహిమాన్వితమైన దివ్యగాథను వివరించే ఈ గ్రంథం, సుమారు రెండువేల పద్యగద్యాలతో ఆరు ఆశ్వాసాలు కలిగి అలరారుతూ వుంది. వేంకటాచలక్షేత్రంలో.... కథానాయకుడైన శ్రీ వేంకటేశ్వరుడు ప్రత్యక్షసాక్షిగాను, ఏకైక శ్రోతగానువుంటూ ఊఁ కొడుతూ వుంటే, పరమభక్తురాలు అయిన వెంగమాంబగళంనుండి పెల్లుబికి, ఆయమలేఖినినుండి జాలువారిన రసవత్ప్రవాహప్రబంధమే "శ్రీ వేంకటాచల మాహాత్మ్యము". తరిగొండ వెంగమాంబ రచించిన ఈ గ్రంథాన్ని పారాయణం చేస్తే పెళ్లికాని వారికి వివాహమవుతుందనీ, ఇంకా ఎన్నో సత్ఫలితాలు కలుగుతాయనీ, శ్రీ వేంకటేశ్వరుని అనుగ్రహం కలుగుతుందని ప్రసిద్ధి ఏర్పడి, తిరుమలకు వచ్చిన యాత్రికులు వేచివుండి ఈ వేంకటాచలమాహాత్మ్యగ్రంథానికి ప్రతులు తయారు చేసుకొని వెళ్లేవారంటే ఈ గ్రంథప్రశస్తి ఎందటిదో స్పష్టమవుతూవుంది. అంతేకాదు. తెలుగులో వెలసిన వేంకటాచలమాహాత్మ్య గ్రంథాలలో నేటికీ దీనికున్న ప్రాచుర్యం మరే గ్రంథానికీ లేదనడం ఎంతమాత్రమూ అతిశయోక్తి కాదు. అత్యుక్తి అంతకంటె కూడ కాదు.

మహాభక్తురాలు, కవయిత్రీ, మహామహిమాన్వితురాలు అయిన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబను నిరంతరం దర్శించే యాత్రికజనం నానాటికీ పెరగసాగింది. కొందరు ఆమెను దర్శిస్తేచాలు జన్మ ధన్యమవుతుందని వచ్చేవారు. మరికొందరు ఆమెచేత ఆశీస్సులను పొందాలని వచ్చేవారు. ఇంకొందరు ఆమె చేసిన భక్తిరచనల గురించి వచ్చేవారు... . ఇలా నిత్యమూ తిరుమల యాత్రికులు స్వామిదర్శనంతోపాటు, వెంగమాంబ దర్శనం కూడ చేసుకొనడానికి వచ్చేవారు. ఇందరితో ఇన్నివిధాలా దర్శించవచ్చే యాత్రికజనం, భక్తజనంచేత క్షణం తెరిపిలేకుండా, తన ఆధ్యాత్మికసాధనకు భంగం కలుగుతుండగా వెంగమాంబ దీనికి ఏదో ఒకపరిష్కారమార్గం అన్వేషించాలని అనుకొంటూవుండగా ఆ రాత్రి యథాప్రకారం, ఆమె వద్దకు ఆనందనిలయుడు వచ్చాడు.

'ఏమిటి నా బంగారుతల్లీ! నేడు అన్యమనస్కవై నన్ను గమనించని కారణం ఏమిటో? విశదంగా చెప్పు' అని స్వామివారు అడిగారు.

అంత వెంగమాంబ "శ్రీనివాసా! రాను రాను పెరుగుతున్న జనసందడివల్ల నా ధ్యానానికి నా సాధనకు భంగం కలుగుతూ విసుగువస్తున్నది. ఇక భరింపలేను. నన్ను నీలో ఐక్యం చేసుకొనవే పరంధామా!" అంటూ బ్రతిమలాడింది. బహువిధాల ప్రార్థించింది.

"ఇంకా కొంతకాలం ఈ వేంకటాచలక్షేత్రంలో నీవు తపస్సాధన చెయ్యవలసింది. అందుకు అనువుగావుండే ఏకాంతమైన దివ్యస్థలాన్ని నీకు చూపిస్తానని చెప్పి శ్రీనివాసుడు క్షణంలో ఆలయానికి ఉత్తరావ 12 మైళ్ల దూరంలోగల తుంబురుతీర్థానికి వెంగమాంబను చేర్చాడు. అక్కడ ఒక గుహను చూపుతూ "వెంకమ్మా నీవు రోజూ పగలంతా నిశ్చింతగా తపస్సాధన చెయ్యి, రాత్రిపూట ఇదిగో ఈ గుహలోని బిలమార్గం ద్వారా, ఆనందనిలయంలోనికి ఏతెంచి నన్ను ఆరాధించవలసింది అంటూ ఆనతిచ్చాడు. ఆనాటినుంచి బంగారువాకిళ్లు మూసివేసిన తర్వాత రాత్రి తుంబురుతీర్థంలోని గుహయందలి బిలమార్గంద్వారా వెంగమ్మ ఆలయానికి వస్తూ ప్రతిరాత్రి శ్రీస్వామివారిని అర్చించేది ఆరాధించేది. ఇలా కొన్ని రోజులు గడిచాయి. పిదప అర్చకులు రాత్రి తాము చేసిన అర్చనలోని పూలు, పక్కకు తీసివేయబడి వుండడం, శ్రీస్వామివారి మూర్తియందు కొత్త పూలు వుండడం గమనించి రాత్రి పూట ఎవరో భక్తులువచ్చి మళ్లీ పూజిస్తూ వున్నారని భావించారు. బహుశా తిరుమల నుంచి అదృశ్యమై ఎక్కడికో వెళ్లిన వెంగమాంబే ప్రతిరాత్రి వచ్చి శ్రీవారిని అర్చిస్తూ వుండవచ్చునని బహువిధాల భావించారు.

అయినా ఈ విషయాన్ని శోధించి తీరవలసిందేనని భావించి, చివరకు అప్పటి మహంతు, ఏకాంతసేవానంతరం, బంగారువాకిళ్లు మూయడానికి ముందే శ్రీవారిఆలయంలోప్రవేశించి ఒకమూలనక్కి ఆగంతకులకోసం కంటిలో వత్తి వేసికొన్నట్లుగా నిరీక్షిస్తూ వుండినాడు. సరిగ్గా అర్ధరాత్రి సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామివారి పాదాలముందు ఒక బిలమేర్పడి అందుండి అద్భుతమైన తేజస్సులు వెదజల్లుతూవుండగా పరమభక్తురాలు అయిన వెంగమాంబ పూజాద్రవ్యములతో పైకి వచ్చింది. అంతే ఆ

అద్భుతప్రకాశాన్ని చూడలేక, వెంగమాంబదర్శనంతో ఆశ్చర్యపోయి, మూర్ఛ పోయినాడు మహంతు.

తెల్లవార సుప్రభాతానంతరం బంగారువాకిళ్లు తెరవగా, మూర్ఛపడి యున్న మ హంతును సేదతీర్చి, అనునయించి ప్రశ్నించగా, నోట మాట రాక,మాటలాడలేక నిదానంగా, ఆ మహంతు వెంగమాంబరాకను, ఆమెను పూజను గూర్చి తెలియజేశాడు. ఆ భక్తురాలు ఇందే, ఈ తిరుమలలోనే ఎక్కడో వుంటూ రోజూ, వచ్చి పూజించి వెళ్లుతున్నదని చెప్పాడు. దీనితో భక్తులు మళ్లీ ఆమెకోసం తిరుమల గుట్టలు, పుట్టలు, కొండలు కోనలు గాలించ సాగారు.

ఇదేసమయంలోనే తిరుమలక్షేత్రానికి ఒక విచిత్రమైన విప్రుడు వచ్చాడు. అతనికి కళ్లూ, నోరూ తప్ప మిగతా శరీరమంతా పుండ్లతో, చీమూ నెత్తు రుయి కారుతూ, దుర్వాసనలతో కంపు కొడుతూ వుండినాడు. భార్యాపిల్లలు, బంధువులు, ఊరివారు, అతనిని చూసి, దరిజేరనీయక నిందించేవారు. తిట్టేవారు. 'దూరం దూరం' అంటూ ఛీదరించుకొనేవారు. పాపం ఆ బాపడు తన ప్రారబ్ధకర్మకు చింతిస్తూ శరీరబాధకన్నా తనబంధువులు పెట్టే మానసిక బాధలకు ఓర్వలేక, తనవారిని, తన వూరిని విడిచిపెట్టి, చివరిగా శ్రీనివాసుని దర్శించి ప్రాణాలను వదలాలని సంకల్పించి తిరుమలకు వచ్చాడు. ఆ దివ్యక్షేత్రంలోకూడ విచిత్రమైన భయంకరమైన కుష్టురోగ పీడితుడైన ఆ బాపని, యాత్రికులు, ఆలయ అధికారులుకూడ వెడల గొట్టారు. ఇక గత్యంతరంలేక ఒకవైపు శరీరబాధ మరోవైపు మానసిక బాధ, ఇంకోవైపు ఆకలి దప్పుల బాధ. ఇలా మూడుబాధలు ఒక్కసారిగా ముప్పిరిగొనగా, ఈ వేంకటాచలంలోనే ఆత్మహత్య చేసుకొనవలెననే దృఢ సంకల్పంతో అందందు తిరుగుతూ, చివరకు తుంబురుకోనకు చేరుకు న్నాడు. ఇలా నానాప్రయాసల కోర్చి అక్కడికి దేకుతూ వెళ్లిన ఆ విప్రునికి శరీరబాధ దుస్సహమై భరించలేక 'గోవిందా! ఏడుకొండలవాడా! ఈ బాధ భరించలేకున్నాను స్వామీ! నాప్రాణాలు తీసివేసి, ఈ కష్టాలను తొలగించుస్వామీ ఏడుకొండలవాడా! వెంకటరమణా! వెంకటరమణా!" అంటూ బిగ్గరగా రోదించినాడు. ఆ నిర్జనారణ్యంలో ఆ బ్రాహ్మడి ఏడుపు

ఆ తుంబురుకోనంతా ప్రతిధ్వనించింది. అంతే అచ్చటి గుహలో తపస్సు చేసుకుంటూవున్న వెంగమాంబ చెవిలో ఈ ఆర్తనాదం పడింది. బయటికి వచ్చి విప్రుని దీనావస్థను చూచి జాలిపడింది. "స్వామీ! వేంకటేశా! ఈ దీనుని ఆర్తిని పోగొట్టుమో దేవా! అంటూ వెంగమ్మ వేంకటేశుని ప్రార్థిస్తూ, ఆకలి దప్పులచేత, శరీరబాధచేత డస్సియున్న ఆ బ్రాహ్మనికి తినడానికి మంచి రుచికరములైన పండ్లను ఇచ్చింది. ఎన్నినాళ్లనుండో తిండిలేక కనీసం పలకరించే దిక్కులేని ఆ పాంథుడు, తనపాలిటి ఏ భాగ్యదేవతో, ఏ వనదేవతో అని భక్తిగా ఆమెకు నమస్కరిస్తూ, ఆమె ఇచ్చిన ఫలాలను ఆవురావురమంటూ కడుపారా తిన్నాడు. పిదప వెంగమాంబ "అయ్యా! నీ ఆర్తి నేటితో సరి. ఇక్కడ నన్ను చూసినట్లుగా ఎవరితోను, ఏసమయంలోను, ఎక్కడా చెప్పకుసుమా! ఒకవేళ నోరు జారావో, నీ తల వేయివక్కలు అవుతుంది జాగ్రత్త!" అంటూ కళ్లుమూసుకోమని చెప్పింది. అలా కళ్లుమూసు కున్న వ్యక్తి, కళ్లు తెరచేంతలో తిరుమల శ్రీవారిఆలయం పక్కన స్వామిపుష్కరిణిలో తేలాడు. లేచిన ఆ బ్రాహ్మడు తన శరీరాన్ని తడిమిచూచుకొని ఆశ్చర్య పడ్డాడు. అదే సమయంలో పుష్కరిణిలో స్నానం చేస్తున్న భక్తులు పుష్కరిణిలో తేలిన భక్తునిచూచి, ఆశ్చర్యపడ్డారు. పుష్కరిణిలోనుంచి పుట్టినందువల్ల అతన్ని పుష్కరిణీజుడని పిలుస్తూ అతని విషయాలను గుచ్చి గుచ్చి అడిగేవారు. ఆ పుష్కరిణీజుడు కూడ వెంగమాంబ పెట్టిన ఆంక్ష వల్ల భీతుడై నోరు మెదపక తిరుమలక్షేత్రంలోనే వుండేవాడు.

మరికొందరు భక్తులు ఇంతకుముందు రోగ పీడితుడై తిరుగుతున్న బ్రాహ్మడే ఈ పుష్కరిణీజునిగా గుర్తించి, అతను పొందిన ఈ సిద్ధికి ఆశ్చర్యపోతూ కానుకలిచ్చేవారు. నమస్కరించేవారు. తమకు అట్టి సిద్ధిని, ఉపదేశించవలసిందని ప్రార్థించేవారు. 'వినాశ కాలే విపరీత బుద్ధిః' అన్నట్లు ఈ పొగడ్తలకు ఉబ్బిపోయిన పుష్కరిణీజుడు, తనకు అకారణంగా వచ్చిన సంపదకు అహంకరించి చాలాకాలం గడిచింది కదా. ఏమవుతుందిలే అన్న నిర్లక్ష్యంతో తుంబురుకోన ప్రాంతంలో తాను వెంగమాంబను చూచినట్లు ఆమె దయవల్లే ఇలా మారినట్లు చెప్పినాడు. అంతే ఆ క్షణంలోనే

ఆ బాపని తల ముక్కలు చెక్కలై విగతజీవి అయ్యాడు. తపస్సంపన్నులైన మహనీయుల వాక్కులు ఎన్నటికిని వృథా కావు కదా!

మళ్లీ వెంగమాంబ ఉనికి తెలిసిన భక్తులు, యాత్రికులు మళ్లీ ఆమెను వెదకటానికి మొదలు పెట్టారు. ఆమెను దర్శించటానికి అర్రులు చాచారు. ఆమెతో మాట్లాడడానికి కుతూహల పడ్డారు.ఆమెనుండి ఆశీస్సులందడానికి ఆనందంతో అడవంతా గాలిస్తూ ఆమె ప్రశాంతతకు, ఏకాంతతకు భంగం కలిగించారు.

ఇలాంటిసమయంలో ఆరాత్రి ఆనందనిలయంలో ప్రవేశించిన వెంగమాంబ "ఓ జగదేకప్రభూ! ఏకాంతంగా నన్ను ఉంచిన తుంబురుకోన కూడ మానవ సంచారంతో ఇప్పుడు అలజడిగా వుంది. ఇక నాకు ఏది ధారి! అని పరి పరివిధాల శ్రీనివాసుని ప్రార్థించింది. అంత స్వామివారు "వెంగమ్మా ఇకమీదట నాకంటె నిన్ను వేరుగా వుంచటం భావ్యమని తలంచటంలేదు. అందువల్ల నీవు తీవ్రమైన సమాధినిష్ఠలో ప్రవేశించు. పరమయోగినివైన నీవు ఆ సమాధినుంచే, ప్రతిరోజు రాత్రి దివ్యమైన తేజోరూపంతో ఆనందనిలయానికి వచ్చి నన్ను సేవించుకోవలసింది." అని అనుమతి ఇచ్చినాడు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆజ్ఞననుసరించి సహస్రచంద్రదర్శనం చేసిన వృద్ధతపస్విని తరిగొండవెంగమాంబ తుంబురుకోన విడిచి, మళ్లీ తిరుమల తిరువీధుల్లో అందరికీ కనపడింది. భక్తులకు దర్శనమిచ్చి ఆనందింపజేసింది. పిదప తనకు కాలమాసన్న మైనదని, శ్రీ వేంకటేశ్వరుడు తనను పిలుస్తున్నాడని, అందువల్ల సమాధిలోనే వుంటూ సిద్ధి పొందుతానని అందరికీ ఎరుక పరచింది. సరిగ్గా నేటికి (1999) 182 ఏండ్లక్రిందట, అంటే ఈశ్వర నామ సంవత్సరంలో, శ్రావణ మాసంలో శుద్ధ నవమినాడు సమాధిలో ప్రవేశించింది. వెంగమ్మ సజీవంగా సమాధిలో ప్రవేశించిన అనంతరం ఆమె ఆజ్ఞప్రకారం సమాధిని సుగంధ ద్రవ్యాలతో మూసివేసి, దానిపైన తులసీ బృందావనాన్ని నిర్మించారు. ఆనాటినుంచి నిత్యమూ భక్తులు ఆమె సమాధిని సేవిస్తూ వుండినారు. క్రీ.శ. 1817 లో సమాధి నిష్ఠురాలై సిద్ధిపొందిన వెంగమాంబవారి బృందావనాన్ని నేటికీ తిరుమలక్షేత్రంలో

శ్రీవరాహస్వామివారి ఆలయానికి ఉత్తరం దిక్కున అంటే తాళ్లపాకవారి, తరిగొండవెంగమ్మగారి ఇంటికి దగ్గర్లోనే ఉత్తరం దిక్కున వందగజాల దూరంలోవున్న వెంగమాంబ తోటలో దర్శించవచ్చును. ఆమె బృందావనం పైన, ఆమె తొట్ట తొలిగా తిరుమల చేరుకున్నసమయంలో దారిలో ఆమెను రక్షించిన "సంతకాపు మొగిలిపెంట" ఆంజనేయస్వామివారి చిన్న విగ్రహం కూడ ప్రతిష్ఠింప బడింది.

తిరుమల వాసులు, కొందరు భక్తులు వెంగమాంబ సమాధిని ప్రతిరోజూ ప్రదక్షిణ చేస్తూ సేవిస్తూ వుంటారు. ప్రతి శుక్రవారం, ప్రతి మంగళవారం, విశేషంగా అలికి ముగ్గులువేసి పూజిస్తూ వుంటారు. ఇక్కడ వ్యవహారంలో 'తరిగణమ్మ'గా పిలువబడుతూ మొక్కులందు కొంటూవున్న పరమభక్తురాలు అయిన తరిగొండ వెంగమాంబ, నేటికీ భక్తులకు దర్శనమిస్తున్నదట! సేవించిన వారి కోరికలను తీరుస్తూ వున్నదట!

ఆ నాటినుండి ప్రతిరాత్రి తరిగొండ వెంగమాంబ ఆ సమాధినుండి దివ్యమైన యోగరూపంతో ఆనందనిలయానికి వెళ్లి శ్రీస్వామివారిని సేవిస్తూ వుంటుందట. ఏది ఏమైనా నేటికీ ప్రతిరోజు రాత్రి ఏకాంతసేవా సమయంలో "ముత్యాల హారతి" అనే కర్పూర నీరాజనం ద్వారా, శ్రీనివాసుడు వెంగమాంబను స్ఫురణకు తెస్తూ, ఆ కర్పూరహారతి వెలుగుల్లో దివ్య ప్రభలతో ప్రకాశిస్తూ, భక్తులందరినీ మైమరిపిస్తూ వున్నాడు. మధురానుభూతుల్ని పంచి పెడుతూవున్నాడు. ఒక దివ్యానందంలో ముంచెత్తుతూ వున్నాడు.

భక్తులపాలిటి పెన్నిధి అయిన బాలాజీ అనుగ్రహంతో ఎప్పుడైనా, శ్రీవారి ఏకాంతసేవలో ప్రత్యక్షంగా పాల్గొనే భాగ్యం కలిగినట్లైతే, తరిగొండవెంగమ్మ ముత్యాలహారతి వెలుగులో ప్రకాశించే శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యమంగళ విగ్రాణ్మూర్తిని, ఆ వెంటనే శయనమండపంలో, బంగారు తూగుటుయ్యాలలో యోగనిద్ర కుపక్రమించే భోగశ్రీనివాస పెరుమాళ్ల దివ్యదర్శనాన్ని కన్నులారా చేస్తూ, ఆ వేంకటేశ్వరస్వామివారితో పాటు తరిగొండ వెంగమాంబవారిని స్మరిస్తూ ధన్యులు కండి. జీవితాన్ని పునీతం చేసికోండి! ప్రత్యక్షంగా ఏకాంత సేవలోపాల్గొనే మహదవకాశాన్ని

కల్గించమని ఆ జగత్కల్యాణ చక్రవర్తిని ప్రార్థిస్తూ, అంతవరకు, అంటే, ఈ క్షణం నుంచే కన్నులుమూసికొని ప్రతి రాత్రి ఆనందనిలయంలో వున్నట్లుగానే భావిస్తూ, తరిగొండ వెంగమాంబవారి "ముత్యాలహారతి" వెలుగులో ముచ్చటగా మురిపిస్తూ మైమరపిస్తూ వున్న కొండలరాయుని కోటి సూర్యప్రభాసమానమైన దివ్యమూర్తిని దర్శిస్తూ, పరమయోగిని మాతృశ్రీ తరిగొండ వెంగమాంబగారి మంగళహారతి పాటతో, మనం అందరం గొంతు కలుపుదాం! ఆ గోవిందుని నిండైన మెండైన అనుగ్రహానికి పాత్రులమవుదాం!

*"మంగళ మలమేలుమంగ చిత్తాబ్జ*
*సారంగ! యిదె నీకు జయమంగళంబు*
*సురచిరగుణ! నీకు శుభ మంగళంబు*
*సద్గురుండగు నీకు సర్వమంగళము"*

*గోవిందా! గోవిందా!! గోవింద!!!*

* * *

Printed at TTD Press, Tirupati